భద్రకాళీని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

కుటుంబసమేతంగా భద్రకాళీని దర్శించుకుంటున్న హైకోర్టు న్యాయమూర్తి సుజోయ్‌పాల్

వరంగల్, నవంబర్ 9 : వరంగల్ భద్రకాళీ అమ్మవారిని హైకోర్టు న్యాయమూర్తి సుజోయ్‌పాల్ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. శనివారం ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ ఈవో శేషుభారతి, ప్రధానార్చకుడు భద్రకాళీ శేషు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ముందుగా ఆదిశంకరాచార్యులు, వల్లభ గణపతిని దర్శించుకున్న తదుపరి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు, అమ్మవారి శేషవస్త్రాలను అందజేసి ఆలయ స్థల పురాణాన్ని వివరించారు. కార్యక్రమంలో వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్, మట్టెవాడ సీఐ తుమ్మ గోపి పాల్గొన్నారు.

రుద్రేశ్వరస్వామికి లక్ష పుష్పార్చన

లక్షపుష్పార్చనతో రుద్రేశ్వరస్వామి

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 9 : చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో కార్తీక మాసోత్సవాల్లో భాగంగా 8వ రోజు శనివారం ఉదయం ఉత్తిష్ఠ గణపతికి పుట్టతేనెతో అభిషేకం నిర్వర్తించి లక్ష పుష్పార్చన చేశారు. సెలవు రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించినట్లు ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. మహిళలు ఉసిరికాయ పూజలు, ఉసిరిక వృక్షపూజలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన మహిళలు దీపాలు వెలిగించారు. భక్తులకు దేవాలయ సిబ్బంది మధుకర్, రామకృష్ణ, మణికంఠశర్మ, ప్రణవ్‌శర్మ, కాశీలింగాచారి శ్రావణ్‌కుమార్ సేవలందించారు. హైకోర్టు జస్టిస్ సుజోయ్‌పాల్ దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అంగరంగ వైభవంగా శోభాయాత్ర

శోభాయాత్రలో పాల్గొన్న గ్రామస్తులు

ఆత్మకూరు, నవంబర్ 9 : ఆత్మకూరులో మూడు రోజుల పాటు పంచకూట శివాలయ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయి. శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శివపార్వతుల విగ్రహాలతో పుర వీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు మంగళ హారతులతో ఘనంగా స్వాగతం పలకారు.

ఆలయాల అభివృద్ధిని విస్మరించిన ప్రభుత్వం

దామెర, అక్టోబర్ 9 : మండలంలోని ల్యాదెళ్ల భోగేశ్వరాలయం(శివాలయం), కోగిల్వాయిలోని చంద్రగిరి చెన్నకేశవస్వామి ఆలయాలను మాజీ ఎంపీపీ కాగితాల శంకర్ శనివారం సందర్శించారు. భోగేశ్వర ఆలయం శిథిలావస్థకు చేరుకున్నదని, ఆలయ సమీపంలో ఉన్న పురాతన కట్టడాలను అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రసిద్ధి గాంచిన కోగిల్వాయి చంద్రగిరి చెన్నకేశవ స్వామి ఆలయ అభివృద్ధిని ప్రభుత్వం విస్మరించిందన్నారు. భక్తుల కోసం కనీస సౌకర్యాలు లేవన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పురాతన ఆలయాల అభివృద్ధికి నిధులను కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సంగనబోయిన మౌనిక-కిరణ్, మాజీ సర్పంచ్ హింగె శ్రీనివాస్ పాల్గొన్నారు.

WANTED
(FEMALE CANDIDATES)
• 1st to 5th Class Qualified English Teachers
• Computer / D.T.P Operators (English, Telugu and Hindi Typing)
• Salary - Rs. 15000/-
Contact Immediately : 80082 73888

జిల్లాలో ప్రారంభమైన కుల సర్వే

- 1916 మంది ఎన్యుమరేటర్లు
- ఇంటింటా వివరాల సేకరణ
- పరిశీలించిన ప్రత్యేక అధికారి వినయ్ కృష్ణారెడ్డి
- పాల్గొన్న కలెక్టర్ ప్రావీణ్య, బల్దియా కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే

సేకరించిన వివరాల ప్రొఫార్మాను పరిశీలిస్తున్న వినయ్ కృష్ణారెడ్డి

హనుమకొండ, నవంబర్ 9 : జిల్లాలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే శనివారం అన్ని మండలాల్లో ప్రారంభమైంది. ఈ సర్వేకు 1,916 మంది ఎన్యుమరేటర్లను నియమించారు. వీరంతా గత మూడు రోజుల నుంచి హౌస్ లిస్టింగ్ పూర్తి చేసి శనివారం నుంచి ఇంటింటా సర్వేను ప్రారంభించారు. ఎన్యుమరేటర్లు ప్రభుత్వం అందజేసిన ప్రొఫార్మా ప్రకారం వివరాలు నమోదు చేస్తున్నారు. ఈ సర్వేను సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ కుల సర్వే ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి వినయ్ కృష్ణారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య, బల్దియా కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడేతో కలిసి వడ్డేపల్లి పరిధిలోని శ్రీనగర్ కాలనీలో పరిశీలించారు. సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లతో మాట్లాడారు. ఒక్కో ఇంటికి సర్వే చేయడానికి ఎంత సమయం పడుతున్నదని అడిగి తెలుసుకున్నారు. సర్వే ప్రాంతంలో ఎన్ని ఎన్యుమరేషన్ బ్లాకులు ఉన్నాయని, ఎన్ని బ్లాకుల్లో సర్వే పూర్తయిందని అడిగి పలు సూచనలు, సలహాలు చేశారు. అలాగే ధర్మసాగర్ మండలంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి సర్వే తీరును పరిశీలించారు. ఈ సందర్భగా ఉమ్మడి వరంగల్ ప్రత్యేక అధికారి మాట్లాడుతూ.. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్లు ప్రతి కుటుంబ వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలని సూచించారు. సర్వే ప్రాంతంలోని కుటుంబాలకు ముందస్తుగా సమాచారం ఇస్తే త్వరగా సర్వే పూర్తి చేయవచ్చన్నారు. సర్వే చేసిన ప్రతి ఇంటికీ స్టిక్కర్ అంటించారా? లేదా అనేది మున్సిపల్ అధికారులు తమ సిబ్బందికి తెలియజేయాలన్నారు.

వీసీలో పాల్గొన్న కలెక్టర్..

సర్వే ప్రక్రియపై హైదరాబాద్ నుంచి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే పాల్గొన్నారు.

గ్రేటర్‌లో క్షేత్రస్థాయిలో..

వరంగల్ : గ్రేటర్ పరిధిలోని 66 డివిజన్లలో ఇంటింటి సర్వే మొదలైంది. పలు డివిజన్లలో స్టిక్కరింగ్ పూర్తి కాకపోవడంలో ఉదయం స్టిక్కర్లు వేసి మధ్యాహ్నం నుంచి సర్వే చేశారు. ప్రతి రోజు 10 నుంచి 15 గృహాలు సర్వే చేయాలని ఆదేశాలు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో సాధ్యం కావడం లేదని సిబ్బంది అంటున్నారు. రెండు ఫార్మాట్లలో ఉన్న సర్వే ఫారాల్లో 74 ప్రశ్నలు ఉన్నాయి. మొదటి ఫార్మాట్ ఫారంలో ఇంటి యాజమాని వ్యక్తిగత వివరాలు, రాజకీయ వివరాలకు సంబంధించిన ప్రశ్నలు ఉండగా, రెండో ఫార్మాట్‌లో స్థిర, చర, భూములకు సంబంధించిన ప్రశ్నలు ఉండడం వాటిని పూరించడం పెద్ద సవాల్‌గా మారిందని అంటున్నారు. ఒక ఇంటికి గంటకు పైగా సమయం పడుతున్నట్లు ఎన్యూమనేటర్లు చెబుతున్నారు. దీనికి తోడు సర్వే ఫారంలోని పలు ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం లేదని వాపోతున్నారు. ఆస్తుల వివరాలు వెల్లడించడం లేదని అధికారులు చెబుతున్నారు. దీంతో మొదటి రోజు కొంత మంది సిబ్బంది రాత్రి వరకు సర్వే చేశారు. గ్రేటర్ పరిధిలోని 2,90,964 గృహాలకు కుటుంబ, కుల సర్వేను నిర్వహించనున్నారు. మొత్తం 1674 మంది ఎన్యుమనేటర్లు సర్వే చేస్తున్నారు. వీరిపై 168 మందిని పర్యవేక్షకులుగా నియమించారు. ఒక్కో ఎన్యుమనేటర్‌కు 120 నుంచి 180 వరకు గృహాలను కేటాయించారు. కాగా, 19వ డివిజన్ కాశీబుగ్గ ప్రాంతంలో జరుగుతున్న సర్వేను ఉమ్మడి జిల్లా సర్వే ప్రత్యేకాధికారి వినయ్ కృష్ణారెడ్డి పరిశీలించారు. ఆయనతో పాటు గ్రేటర్ డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి ఉన్నారు.

శాయంపేటలో సర్వే షురూ..

శాయంపేట : ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభమైంది. ఎన్యమరేటర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలను నమోదు చేశారు. మండలంలో 95 మంది ఎన్యుమరేటర్లు సర్వేలో పాల్గొంటున్నట్లు అధికారులు చెప్పారు. 13 మంది సూపర్‌వైజర్లు పరిశీలిస్తున్నారు.

పనులు నిలిచిపోవడంతో కంకర లేచిన పరకాల-కొప్పుల రోడ్డు

కంకర పోశారు.. వదిలేశారు!

ఆగిన పరకాల-కొప్పుల బీటీ రోడ్డు పనులు

శాయంపేట, నవంబర్ 9 : మండలంలోని కొప్పుల నుంచి పరకాలకు నూతనంగా నిర్మించనున్న బీటీ రోడ్డు పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఆరునెలలుగా పనులు జరగక పోవడంతో తమ ఏండ్ల కల నెరవేడం లేదని కొప్పుల వాసులు ఆవేదన చెందుతున్నారు. కొప్పుల నుంచి పరకాలకు వెళ్లాలంటే చిన్నకోడెపాక, చెన్నాపూర్ ద్వారా సుమారు పది కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తుందని వాపోయారు. ఈ క్రమంలో ఎన్నో ఏళ్లుగా కొప్పుల నుంచి పరకాలకు బీటీ రోడ్డు వేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో గత కేసీఆర్ సర్కారు నిధులను మంజూరు చేసింది. కొప్పుల శివారు నుంచి సుమారు ఆరు కిలోమీటర్లు బీటీ రోడ్డు నిర్మాణానికి సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఏటూరునాగారం మంజూరు చేసిన రూ.5.85కోట్లతో గతేడాది అక్టోబర్ 1న శంకుస్థాపన చేశారు. అలాగే పంచాయతీరాజ్ శాఖ నుంచి పరకాల-కొప్పుల రోడ్డు మధ్యలో వంతెన నిర్మాణానికి రూ.5.75కోట్లను సర్కారు అందించింది. టెండర్లు పూర్తయి కాంట్రాక్టర్ పనులు చేపట్టాడు. రోడ్డు పనుల్లో పలు చోట్ల అభ్యంతరాలు వచ్చినట్లు తెలిసింది. దీంతో పనులు పూర్తిస్థాయిలో జరగలేదని చెబుతున్నారు. ఈ రోడ్డు పూర్తయితే పరకాలకు వెళ్లేందుకు కొప్పుల వాసులకు ఆరు కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. అయితే కంకరపోసి పనులు చేశారు. బీటీ పడలేదు. కొన్ని నెలలుగా పనులు నిలిచిపోయినట్లు రైతులు చెప్పారు. ఈ క్రమంలో పోసిన కంకరలేచి ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. రోడ్డులో నాలుగు చోట్ల బ్రిడ్జి నిర్మాణాలు జరగాల్సి ఉన్నది. ఒకదానికి నిధులు రాగా మిగిలిన వాటికి ప్రతిపాదనలు పంపినట్లు ఐటీడీఏ ఇంజినీరింగ్ అధికారి చెప్పారు. ఈ క్రమంలో కొప్పుల ప్రజలు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న పరకాల రోడ్డు పనులను చేపట్టి త్వరగా పూర్తిచేయాలని అధికారులను కోరుతున్నారు.

రోడ్డు మధ్యలో బ్రిడ్జి నిర్మించాల్సిన ప్రదేశం

బస్సు ఢీకొని డెలివరీ బాయ్ మృతి

సుబేదారి, అక్టోబర్ 9 : బస్సు ఢీకొని డెలివరీ బాయ్ మృతి చెందిన ఘటన బాలసముద్రంలో శనివారం జరిగింది. సుబేదారి పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ కరీమాబాద్‌కు చెందిన చందు ప్రసాద్(26) జొమాటో ఫుడ్ డెలివరీ కంపెనీలో పనిచేస్తున్నాడు. రోజువారీ విధుల్లో భాగంగా హనుమకొండ బస్‌స్టేషన్ జంక్షన్‌లోని రెస్టారెంట్‌లో ఫుడ్ తీసుకొని కస్టర్‌మర్‌కు డెలివరీ చేయడానికి బైక్‌పై అదాలత్ వైపు వెళ్తుండగా బాలసముద్రం వద్ద ఆర్టీసీ లోకల్ బస్సు వేగంగా ఢీకొట్టడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, జొమాటో డెలివరీ బాయ్స్ పెద్ద సంఖ్యలో హనుమకొండ బస్‌స్టేషన్ జంక్షన్‌లో ధర్నా నిర్వహించారు. మృతుడు చందు ప్రసాద్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. డ్రైవర్ ఓవర్ స్పీడ్‌గా బస్సు డ్రైవింగ్ చేయడంతో ఈ ప్రమాదం జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు అంటున్నారు.

వృద్ధురాలి నేత్రదానం

కమలాపూర్, నవంబర్ 9 : మండలంలోని దేశరాజ్‌పల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు కొనిశెట్టి కౌసల్య అనారోగ్యంతో మృతి చెందగా, శనివారం కుటుంబ సభ్యులు నేత్రదానం చేసేందుకు అంగీకరించారు. సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించడంతో టెక్నీషియన్ నరేందర్ నేత్రాలను సేకరించి, హైదరాబాద్‌లోని ఐ ఇన్‌స్టిట్యూట్‌కు తరలించారు. నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులను గ్రామస్తులు అభినందించారు.

వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ దేవేందర్

దోపిడీ ముఠా అరెస్టు

నయీంనగర్, నవంబర్ 9 : దోపిడీ ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. కేయూ పోలీసు స్టేషన్‌లో ఏసీపీ దేవేందర్ వివరాలను వెల్లడించారు. హనుమకొండ రాంనగర్‌కు చెందిన గోదారి శేఖర్ ఆటో నడిపుకుంటూ జీవనం సాగించేవాడు. వచ్చే డబ్బులు సరిపోకపోవడంతో పరకాలకు చెందిన లక్ష్మి అనే మహిళకు రూ.1000 ఇచ్చి ఒక సిమ్‌ను తీసుకుని జోడీ.కామ్‌లో లక్ష్మి అనే పేరుతో ఒక ప్రొఫైల్ క్రియేట్ చేసి, భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామానికి చెందిన దేవులపల్లి శ్రీనివాస్‌ను పరిచయం చేసుకుని కొంతకాలంగా వాట్సప్‌లో చాటింగ్ చేస్తున్నాడు. శేఖర్ లేడీ వాయిస్‌తో మాట్లాడి కోమటిపల్లి రైల్వేట్రాక్ వద్దకు పిలిపించి అతడి నుంచి రూ.24వేలను లాక్కున్నాడు. ఇన్ని రోజుల నుంచి తప్పించుకుని తిరుగుతున్న వారు గోపాలపురం జంక్షన్‌లో ఉన్నారనే సమాచారంతో సీఐ తన సిబ్బందితో వెళ్లి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.24వేలు, 3 సెల్‌ఫోన్లు, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. అతడికి సహకరించిన దుర్గం రాజయ్య, దుర్గం లక్ష్మయ్యను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. పరారీలో ఉన్న లక్ష్మిని త్వరలోనే పట్టుకుంటామన్నారు. సమావేశంలో సీఐ రవికుమార్, ఎస్సైలు రవీందర్, ప్రవీణ్ కుమార్, సిబ్బంది నర్సింగరావు, సల్మాన్‌పాషా, రవిప్రసాద్ పాల్గొన్నారు.

గోవులను తరలిస్తున్న ఐదుగురు..

కాజీపేట, నవంబర్ 9 : గోవులను అక్రమంగా తరలిస్తున్న ఐదుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసిన ఘటన శనివారం జరిగింది. కాజీపేట ఎస్సై శివకృష్ణ కథనం ప్రకారం.. బాపూజీనగర్‌లోని మార్కెట్ సమీపంలో ఏఎస్సై శ్రీధర్ సిబ్బందితో పెట్రోలింగ్ చేస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు టాటా ఏస్ వాహనాన్ని తనిఖీ చేసి, గోవులను అక్రమంగా తరలిస్తున్న ఐదుగురు వ్యక్తులను పట్టుకున్నారు. బాలిరెడ్డి, బాబురావు, రాజేశ్, ఇమ్రాన్, పాషాపై కేసు నమోదు చేశామన్నారు. గోవులకు వెటర్నరీ వైద్యుడితో పరీక్షలు నిర్వహించి, గోసంరక్షణశాలకు తరలించామని తెలిపారు.

ముదిరాజ్‌లకు అండగా ఉంటా..

- నాడు ఏడాదికి రూ.110కోట్లు ఖర్చు.. నేడు రూ.16కోట్లు ఖర్చు
- రాష్ట్రంలో 26వేల చెరువులకు పెంచిన ఘనత కేసీఆర్‌దే..
- ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

కమలాపూర్ పెద్ద చెరువులో చేప పిల్లలను పోస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

కమలాపూర్, నవంబర్ 9 : ముదిరాజ్ కులస్తులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటానని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. శనివారం కమలాపూర్ పెద్ద చెరువులో చేప పిల్లలను పోసిన అనంతరం మాట్లాడారు. సమైక్య రాష్ట్రంలో 323 చెరువులు ఉంటే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత మిషన్ కాకతీయ పథకం ద్వారా మొత్తం చెరువులను 26వేలకు పెంచిన ఘనత కేసీఆర్‌దేనని అన్నారు. గతంలో ముదిరాజ్‌ల కోసం కేసీఆర్ ఏడాదికి రూ.110కోట్లు ఖర్చు పెడితే, ఇప్పుడు కాంగ్రెస్ కేవలం రూ.16కోట్లు మాత్రమే ఖర్చు పెట్టిందన్నారు. రాష్ట్రంలో రూ.84కోట్లు ఖర్చు పెట్టి 85కోట్ల చేప పిల్లలు, మరో రూ.26కోట్లతో 10వేల రొయ్యలు జలాశయాల్లో పోశారని గుర్తుచేశారు. గత ప్రభుత్వం ముదిరాజ్‌ల కోసం ఏడేళ్లలో రూ.550కోట్లు ఖర్చు పెట్టి 524కోట్ల చేప పిల్లలు వేసిందన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో 283 చెరువులు ఉంటే గత ప్రభుత్వం 60లక్షల చేప పిల్లలు పంపిణీ చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం 26లక్షల చేప పిల్లలు మాత్రమే పంపిణీ చేసిందన్నారు. చేప పిల్లల పంపిణీ ఎందుకు తగ్గిస్తున్నారో కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. చేపల పెంపకంపై అనేక మంది మత్స్యకారులు ఆధారపడి జీవిస్తారన్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తొక్కి చంపుతానని బెదిరింపులకు దిగుతున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట సింగిల్ విండో చైర్మన్ సంపత్ రావు, వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, తహసీల్దార్ సురేశ్, సీఐ హరికృష్ణ, బీఆర్ఎస్ నాయకులు లక్ష్మణ్‌రావు, తిరుపతిరెడ్డి, నవీన్‌కుమార్, చంద్రారెడ్డి, సమ్మయ్య ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం

సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి

సమావేశంలో మాట్లాడుతున్న భిక్షపతి

శాయంపేట, నవంబర్ 9 : వడ్ల కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. మండల కేంద్రంలో శనివారం మండల కార్యదర్శి బత్తిని సదానందం అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. రోడ్లపై, కల్లాల్లో, కొనుగోలు కేంద్రాల్లో పెద్ద ఎత్తున వడ్లు ఉన్నాయని, రైస్‌మిల్లర్లు, అధికారులు నిర్లక్ష్యం వల్ల కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతులందరికీ తప్పకుండా రూ.2లక్షల రుణమాఫీ చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తామన్నారని, కానీ వంట నూనె ధరలు రూ.160కి చేరాయని అధికారులు, ప్రభుత్వం ఎవరికి కొమ్ము కాస్తున్నదన్నారు. విజిలెన్స్ అధికారులతో దాడులు నిర్వహించి బ్లాక్‌మార్కెట్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. పెద్దకోడెపాక రెవెన్యూ శివారులోని ప్రభుత్వ భూమిలో నిరుపేదలకు గుడిసెలు వేయించామని, ఎమ్మెల్యే సత్యనారాయణరావు గుర్తించి అర్హులందరికీ ఇళ్ల స్థలాలు, పక్కా ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. హైడ్రాలో ఉన్నత వర్గాల కబ్జాలపై చర్యలు తీసుకోవాలని, పేదల ఇళ్ల జోలికి వస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి, మండల సహాయ కార్యదర్శి అనుకారి అశోక్ పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు మరో అవకాశం

- జిల్లా ఓటర్లు 5,07,256 మంది
- 28 వరకు అభ్యంతరాల స్వీకరణ
- వచ్చే ఏడాది 6వ తేదీన తుది జాబితా ప్రకటన

హనుమకొండ, నవంబర్ 9 : భారత ఎన్నికల సంఘం ఓటరు నమోదుకు మరో అవకాశం కల్పించింది. అందుకుగాను స్పెషల్ సమ్మరీ రివిజన్ ఆఫ్ ఫొటో ఎలక్టోరోల్ - 2025 ద్వారా షెడ్యూల్ విడుదల చేసింది. ఈ షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 29న సమగ్ర ముసాయిదా ఓటరు జాబితాను జిల్లా అధికారులు విడుదల చేశారు. జిల్లాలోని పరకాల, వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో పురుషులు, మహిళలు, ఇతరు కలిసి మొత్తం 5,07,256 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులకంటే మహిళలే అధికంగా ఉన్నారు. కాగా, కొత్తగా 2025 జనవరి ఒకటో తేదీ వరకు 18 సంవత్సరాలు నిండే వారందరూ ఓటరుగా నమోదు చేసుకొనేందుకు అవకాశం కల్పించింది. నూతనంగా ఓటర్లు సంబంధిత ఓటరు నమోదు అధికారికి, రెవెన్యూ డివిజినల్ అధికారికి, తహసీల్దార్ కార్యాలయాల్లో లేదా https://voters.eci. gov.in/, Voter Helpline మొబైల్ యాప్ ద్వారా నమోదు చేసుకోవచ్చును. ఓటరు జాబితాపై ఈ నెల 28వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. వచ్చిన అభ్యంతరాలను డిసెంబర్ 24వ తేదీలోగా పరిష్కరిస్తారు. 2025 జనవరి 6న తుది ఓటరు జాబితాను ప్రకటించనున్నట్లు అధికారులు తెలిపారు.

ఓటరుగా నమోదు చేయించుకోవాలి..

శాయంపేట/ఐనవోలు : 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ సత్యనారాయణ అన్నారు. శనివారం ఓటరు సవరణ స్పెషల్ క్యాంపెయిన్ డే నిర్వహించారు. తహసీల్దార్ 15 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆదివారం ఈ కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. మండలంలో 42 పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఆర్ఐ రమేశ్, సీనియర్ అసిస్టెంట్ అచ్చారావు, జూనియర్ అసిస్టెంట్ శైలజ, పాల్గొన్నారు. ప్రత్యేక ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలని ఐనవోలు తహసీల్దార్ విక్రమ్‌కుమార్ అన్నారు. వెంకటాపురం పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఆర్ఐ మల్లయ్య ఉన్నారు.

ఐనవోలు: వెంకటాపురం పాఠశాలలో బీఎల్వోలకు సూచనలు ఇస్తున్న తహసీల్దార్ విక్రమ్‌కుమార్

శాయంపేట : ఓటరు సవరణ క్యాంపును పరిశీలిస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ

శ్రీ చైతన్య విద్యార్థుల వరల్డ్ రికార్డ్

వరంగల్ జిల్లా శ్రీ చైతన్య విద్యా సంస్థల ఏజీఎం రాజేశ్వర్ రెడ్డి

కాజీపేట, నవంబర్ 9 : హైదరాబాద్‌లో ఈ నెల 6న నిర్వహించిన సూపర్ హ్యాట్రిక్ వరల్డ్ రికార్డ్ కార్యక్రమంలో శ్రీ చైతన్య విద్యా సంస్థల విద్యార్థులు పాల్గొని కేవలం మూడు గంటల వ్యవధిలో 600 గణిత ఫార్ములాలను ఏకకాలంలో పఠించి రికార్డు సృష్టించడం అభినందనీయమని వరంగల్ ఉమ్మడి జిల్లా శ్రీ చైతన్య విద్యా సంస్థల ఏజీఎం రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం మాట్లాడుతూ.. హైదరాబాద్ మియాపూర్‌లోని శ్రీ చైతన్య స్కూల్‌లో యూకేలోని వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ ప్రతినిధుల పర్యవేక్షణంలో నిర్వహించిన కార్యక్రమంలో 20 రాష్ట్రాలకు చెందిన సుమారు పది వేల మంది విద్యార్థులు ఆన్ లైన్ ద్వార భాగస్వామ్యులయ్యారన్నారు. ఈ సారి గణిత ఫార్ములాలను పఠించడం ద్వారా తమ విద్యార్థులు హ్యాట్రిక్ వరల్డ్ రికార్డును సొంతం చేసుకున్నారని ఆయన వెల్లడించారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సమితి సభ్యులు

ఆదివాసీ హక్కులను కాలరాస్తున్న కాంగ్రెస్

తుడుందెబ్బ రాష్ట్ర కన్వీనర్ బుర్స పోచయ్య

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 9 : కాంగ్రెస్ ప్రభుత్వం ఆదివాసీ హక్కులను కాలరాస్తున్నదని ఆదివాసీ హక్కుల పోరాటసమితి(తుడుందెబ్బ) రాష్ట్ర కన్వీనర్ బుర్స పోచయ్య మండిపడ్డారు. శనివారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అటవీహక్కుల చట్టం-2006 ప్రకారం ఆదివాసీలు ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న పోడు భూములకు శాశ్వత పట్టాలివ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పీసాను సమర్థవంతంగా అమలు చేయాలని, పీసాలో గిరిజనేతరుల ప్రమేయాన్ని తొలగించాలన్నారు. ఆదివాసీ కమిషనర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తుడుంబెబ్బ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో డిసెంబర్ 3న హనుమకొండలో నిర్వహిస్తున్న జిల్లా మహాసభ కరపత్రాలను వారు ఆవిష్కరించారు. మహాసభల తర్వాత నిర్దిష్టమైన పోరాట కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. సమావేశంలో రాష్ట్ర కోకన్వీనర్లు సిద్ధబోయిన లక్ష్మీనారాయణ, పోదెం బాబు, ఆగబోయిన రవి, గుర్రాల రవీందర్, పెందూరి పుష్పరాణి, సోయం రాజేందర్, కుడిమేత తిరుపతి, పోదెం రామ్మూర్తి, గొగ్గల కోటయ్య, వరంగల్ జిల్లా కన్వీనర్ సదానందం, కోకన్వీనర్లు సోయం శ్రీనివాస్, కృష్ణ, మహబూబాబాద్ జిల్లా కన్వీనర్ సిద్ధబోయిన సంజీవ్, కో కన్వీనర్ ఈక విజయ్‌కుమార్, ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ పుర్క బాబురావు, కో కన్వీనర్లు పుర్క చిద్రు, కోటేశ్ తదితరులు పాల్గొన్నారు.


ఎంపికైన విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ భిక్షాలు

ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు కేయూ ఇంజిన